

పదోన్నతులు లేక..

ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలు, భాషా పండితులు పదోన్నతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

- 8లో ▸



పొలం బాట

వ్యవసాయ అధికారులు పొలం బాట పట్టారు. పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6 /9.2

ఉదయం పొగమంచు కురుస్తుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మాచారెడ్డి ఐకేపీ ఏపీఎంపై బదిలీ వేటు!

సాక్షి, కామారెడ్డి: మాచారెడ్డి ఐకేపీ ఏపీఎం మనోహర్‌పై బదిలీ వేటు పడింది. ఆయనను మద్నూర్ మండలానికి బదిలీ చేశారు. అభయహస్తం, పావలా వడ్డీ రాయితీ బకాయి నిధుల విడుదల కోసం బీజేపీ నేత వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు ఆందోళనలు చేస్తున్నారు. మాచారెడ్డిలో బుధవారం నిర్వహించిన భారీ ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. ఈ సమయంలో ఏపీఎంను బదిలీ చేయడం కామారెడ్డి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

5,570 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమంలో 5,570 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం అయిన 833 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. జిల్లా ఇప్పటివరకు మొత్తం 54,012 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 10,816 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఈఎల్‌టీఏకు ఎంపిక



మాచారెడ్డి: పాల్వంచ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రాజశ్రీ రాష్ట్ర స్థాయి ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయుల అసోసియేషన్(ఈఎల్‌టీఏ)కు ఎంపికైంది. రాజశ్రీ రాష్ట్ర స్థాయి ఈఎల్‌టీఏ స్పెల్ రిజార్డ్‌కు ఎంపికైందని ఆంగ్ల ఉపాధ్యాయురాలు ఇందిర తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈవో రాజు విద్యార్థినితో పాటు ఆంగ్ల ఉపాధ్యాయురాలిని అభినందించారు.

11 నుంచి టీసీసీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలను ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ విద్యార్థులు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాకేంద్రంలో పరీక్ష కేంద్రాలు ఉంటాయని తెలిపారు.

సబ్ సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సబ్‌సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భిక్కనూరు మండలంలో భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి, అంచనూరు, కామారెడ్డి మండలం శాబ్దిపూర్, మాచారెడ్డి మండల కేంద్రంలో సబ్‌సెంటర్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించారని తెలిపారు.

పడిపోయిన పత్తి ధర



మద్నూర్: పత్తి ధరలు రోజుకురోజుకు తగ్గిపోతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి ధర రూ.8 వేల లోపునకు పడిపోయింది. శుక్రవారం మద్నూర్ పత్తి మార్కెట్ బీట్‌లో క్వింటాలుకు రూ. 7,800 లే పలికింది. వారం క్రితం వరకు రూ. 8,200 పైనే లభించింది. వారంలో క్వింటాలుకు రూ. 400 తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి పత్తి ధరలు పడిపోతుండడంతో చాలా మంది రైతులు పంటను అమ్ముకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. పత్తి ధర పెరుగకపోదా అన్న ఆశతో ఇళ్లలోనే నిలువ చేసుకుంటున్నారు. దీంతో శుక్రవారం మద్నూర్ మార్కెట్‌కు 225 క్వింటాళ్ల పత్తిని రైతులు తీసుకువచ్చారని మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ తెలిపారు.

‘గులాబీ’ ముళ్లు!

- బల్దియాలలో ముదురుతున్న లొల్లి
- ఇప్పటికే ఎల్లారెడ్డిలో కౌన్సిలర్ల తిరుగుబాటు
- కామారెడ్డిలోనూ లుకలుకలు
- సొసైటీల్లోనూ అవిశ్వాసం వైపు అడుగులు

జిల్లాలో తిరుగులేని శక్తిగా ఎదిగిన బీఆర్‌ఎస్ పార్టీలో ఇన్నాళ్లు నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తులు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. స్థానిక సంస్థల పాలకవర్గ సభ్యుల మధ్య విభేదాలు ముదిరి ‘అవిశ్వాసం’ వైపు దారి తీస్తున్నాయి. ఇప్పటికే ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో కౌన్సిలర్లు తిరుగుబాటు చేయగా.. కామారెడ్డిలోనూ ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



సాక్షి, కామారెడ్డి: పాలకవర్గాలపై సభ్యులకు విశ్వాసం సన్నగిల్లుతోంది. బల్దియాలతోపాటు జిల్లా, మండల పరిషత్‌లలోనూ విభేదాలు ముదురుతున్నాయి. జిల్లాలోని మున్సిపాలిటీలు, జిల్లా, మండల పరిషత్‌లు, సహకార సంఘాలన్నీ దాదాపు అధికార పార్టీ చేతుల్లోనే ఉన్నాయి. కొన్నిచోట్ల కాంట్రాక్టుల లొల్లి, మరికొన్ని చోట్ల ప్రొటోకాల్ సమస్య, ఇంకొన్ని చోట్ల ఆధిపత్య పోరు, నిధుల కేటాయింపులో వివక్ష... విభేదాలకు కారణమవుతున్నాయి. ఆయా కారణాలతో ‘గులాబీ’ నేతలు అవిశ్వాసపు రాజకీయాలకు తెరలేపుతున్నారు. ఇప్పటికే ఎల్లారెడ్డి బల్దియాలో అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో నాలుగేళ్ల తర్వాతే అవిశ్వాసం పెట్టేందుకు అవకాశం ఉండడంతో ఇంతకాలం బయటపడలేదు. జూన్‌లో నాలుగేళ్లు పూర్తవుతుంది. అప్పుడు మండల, జిల్లా పరిషత్‌లలో అవిశ్వాసపు పంచాయతీ మొదలవుతుందని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీలో పెరుగుతున్న విభేదాలు నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ఎల్లారెడ్డిలో అవిశ్వాసానికే మొగ్గు...

ఎల్లారెడ్డి బల్దియాలో 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. 12 వార్డులుండగా.. తొమ్మిది వార్డుల్లో టీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, మూడు వార్డుల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు విజయం సాధించారు. చైర్మన్‌గా కుడుముల సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా ముస్త్యాల సుజాత ఎన్నికయ్యారు. అయితే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆశించిన మరో ఇద్దరు నేతలు అసంతృప్తికి గురయ్యారు. అవిశ్వాసం పెట్టేందుకు మూడేళ్ల వరకు అవకాశం లేదు. దీంతో సమయం కోసం వేచిచూస్తున్న అసంతృప్తులు.. గతనెలలో గడువు ముగియడంతో అవిశ్వాసం దిశగా పావులు కదిపారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అల్లం శ్రీనివాస్, పద్మ శ్రీకాంత్, జంగం నీలకంఠంతో పాటు నునుగొండ భూదేవి భర్త శ్రీనివాస్, గాదె విజయలక్ష్మి భర్త తిరుపతి, మంచిర్యాల మహేశ్వరి భర్త విద్యాసాగర్, సంగని బాలమణి భర్త పోచయ్య క్యాంపునకు తరలివెళ్లారు. వీరంతా గోవాలో ఉన్నట్లు తెలిసింది. వీరు అవిశ్వాసం నోటీస్ ఇచ్చేందుకు అవసరమైన పత్రాలను సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.

12 మంది సభ్యులున్న ఎల్లారెడ్డి బల్దియాలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టాలంటే ఎనిమిది మంది సభ్యుల మద్దతు అవసరం. ఎలాగైనా చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలన్న పట్టుదలతో ఉన్న ఏడుగురు కౌన్సిలర్లు మరో ఇద్దరికి గాలం వేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే చైర్మన్ సత్యనారాయణ తన వెంట ఉన్న నలుగురు కౌన్సిలర్లు చేజారకుండా జాగ్రత్త పడుతున్నారు.

సహకార సంఘాల్లోనూ...

జిల్లాలోని పలు సహకార సంఘాల్లోనూ పాలకవర్గాల సభ్యుల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. అవిశ్వాసం పెట్టేందుకు అవకాశం కోసం చాలాచోట్ల ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల మీద కన్నేసినవారు.. అవిశ్వాసం ద్వారా వాటిని కైవసం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఓ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసానికి పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కామారెడ్డిలోనూ విభేదాలు...

కామారెడ్డి బల్దియా పాలకవర్గంలో విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. కౌన్సిల్‌లో అధికార పార్టీ సభ్యులే మూడు వర్గాలుగా విడిపోయారన్న ప్రచారం జరుగుతోంది. గ్రూపులుగా విడిపోయిన కౌన్సిలర్లు కొంత కాలంగా బల్దియాపై ఆధిపత్యం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మున్సిపల్ మీటింగ్‌లో పలువురు అధికార పక్ష కౌన్సిలర్లు ప్రతిపక్ష పార్టీల సభ్యులతో కలిసి నేలపై బైఠాయించి నిరసన తెలిపిన సందర్భాలున్నాయి. ఇటీవల మాస్టర్ ప్లాన్ వివాదంతో సభ్యుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ఒక వర్గం సిద్ధమవుతుండగా.. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి మరోవర్గం ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్ల మద్దతు కోసం మంతనాలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



ఎమ్మెల్యే జాజాల సురేందర్

అసెంబ్లీ బాట

హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని అసెంబ్లీ హాల్‌లో శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశంలో జిల్లాకు చెందిన ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలి



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

- ప్రమాదాల నివారణకు కృషి చేయాలి
- ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మాచారెడ్డి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మాచారెడ్డి మండలంలోని పాల్వంచమర్రి వద్దనున్న ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండర్స్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు క్షతగాత్రులకు తక్షణ సాయం అందించి వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రమాదం జరిగిన గంటలో క్షతగాత్రులను ఆస్పత్రులకు చేర్చితే వారిని కాపాడవచ్చన్నారు. వాహనాలను నడిపేవారు రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరి ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య, డీఎస్పీ సురేశ్, రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్, మాచారెడ్డి ఎస్సై సంతోష్, రోడ్డు సేఫ్టీ వర్టికల్ ఇన్‌చార్జి చంద్రభాను, ఏఆర్ డీఎస్పీ ఉదయకృష్ణ, ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ క్లినికల్ ఫ్యాకల్టీలు సుమన్, మధుసూదన్ రావు, మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, పాల్వంచ హెచ్‌ఎం జతాలాల్, ఆటోవాలాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్‌లో జిల్లా నాయకుల హడావుడి

- మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాల నుంచి పార్టీలో చేరాలని పలువురికి ఆహ్వానం
- తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం



నాందేడ్‌లో బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షకీల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సభ నేపథ్యంలో జిల్లా నేతలు వారం రోజులుగా హడావుడి చేస్తున్నారు. ఈ సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సహా పలువురు నాందేడ్ జిల్లాలోని నాయగావ్, ముఖ్కేడ్, దెగ్లూర్, ధర్మాబాద్, కిన్వట్ తదితర ప్రాంతాల్లో వరుసగా పర్యటనలు చేస్తున్నారు. సరిహద్దులో ఉన్న బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే షకీల్ అక్కడే తిష్ట వేసి తిరుగుతున్నారు. నాందేడ్‌లో సభ నిర్వహణ అనుమతులు ఇతర వ్యవహారాల గురించి రాష్ట్ర సివిల్ సప్లెస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ దగ్గరుండి చూస్తుండగా, చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రం నిజామాబాద్ జిల్లా నాయకులే నిరంతరం తిరుగుతున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత విస్తృతంగా పర్యటనలు చేస్తూ పలువురిని కలుస్తున్నారు. కాంగ్రెస్, శివసేన, ఎన్‌సీపీ, బీజేపీకి చెందిన పలువురు నేతలను కలిసి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ప్రోత్సహిస్తున్నారు. నాందేడ్ సభ సందర్భంగా నాందేడ్ జిల్లాలోని నియోజకవర్గాలతో పాటు విదర్భ ప్రాంతంలోని చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాలకు చెందిన పలువురు నాయకులను సైతం బీఆర్‌ఎస్‌లో చేరాలని కోరుతున్నారు. ఇప్పటికే అక్కడ పలువురు నాయకులు వీరితో టచ్‌లో ఉన్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను దేశమంతటా అమలు చేస్తామని, అదేవిధంగా రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కృతనిశ్చయంతో ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా నిజామాబాద్ జిల్లాలోని సరిహద్దు నియోజకవర్గాల నుంచి పలువురు నాయకులు నాందేడ్ సభకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. జిల్లాకు సరిహద్దుల్లో ఉన్న నాందేడ్ జిల్లాలోని పలువురు సర్పంచ్‌లు, స్థానిక నాయకులను బీఆర్‌ఎస్‌లో చేరాలని తమకు ఉన్న పరిచయాల ద్వారా జిల్లా నాయకులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తానికి నాందేడ్ సభ నేపథ్యంలో జిల్లా నాయకుల హడావుడి నడుస్తోంది.

మహిళా సంఘాలకు బకాయిలు చెల్లించాలి

- ప్రభుత్వం స్పందించకపోతే 10 నుంచి నిరశన దీక్ష..
- కోటిమంది కోసం చావడానికైనా సిద్ధం
- బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి
- జిల్లాకేంద్రంలో కదం తొక్కిన మహిళలు



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



నిజాంసాగర్ చౌరస్తాలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లాలో మహిళా సంఘాల సభ్యులకు రావాల్సిన రూ. 200 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. మహిళా సంఘాల సభ్యులకు రావాల్సిన అభయ హస్తం, స్త్రీ నిధి, వడ్డీ లేని రుణాలకు సంబంధించిన బకాయిలకోసం కామారెడ్డి నియోజకవర్గంలో ‘మరో మారు మహిళా పోరు’ పేరుతో వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సుమారు 7 వేల మంది మహిళలతో భారీ ర్యాలీ తీశారు. గాంధీగంజ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సిరిసిల్ల రోడ్, స్టేషన్‌రోడ్, రైల్వే బ్రిడ్జి మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు సాగింది. చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు కోటి మంది మహిళా సంఘాల సభ్యులకు ఐదేళ్లుగా అభయ హస్తం, స్త్రీ నిధి, వడ్డీ లేని రుణాలకు సంబంధించిన నిధులు రావడం లేదన్నారు. రావాల్సిన నిధులు ఇవ్వకుండా ముష్టిగా పింఛన్, రైతు బంధు ఇస్తూ మహిళలను ఆర్థికంగా ఎదగకుండా చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రెండు రోజుల్లో మహిళా సంఘాలకు బకాయిలను విడుదల చేయాలన్నారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, సోమవారం నుంచి వేలాది మంది మహిళలతో నాలుగు రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే 10 వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోటి మంది మహిళలకు లబ్ధి చేకూర్చడానికి తాను చావడానికైనా సిద్ధమని పేర్కొన్నారు. మహిళల ఉద్యమం రాష్ట్ర వ్యాప్తం కాకముందే ప్రభుత్వం మేల్కొని, సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నానన్నారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళనలో బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రో కబడ్డీ టోర్నీ ప్రారంభం





పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం సోదరుడు శంభురెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి.. తలపడుతున్న జట్లు

బాన్సువాడ టౌన్: బాన్సువాడలోని మినీ స్టేడియంలో శుక్రవారం ప్రోకబడ్డీ టోర్నీ ప్రారంభమైంది. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తల్లిదండ్రులు పాపమ్మ, రాజిరెడ్డిల జ్ఞాపకార్థం ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. స్పీకర్ సోదరుడు పోచారం శంభురెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు టోర్నీ సాగనుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన 16 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. పురుషుల విభాగంలో 14 జట్లు, మహిళల విభాగంలో 2 జట్లు తలపడుతున్నాయి. విజేతకు రూ. 30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ. 20 వేల నగదు బహుమతి అందించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు పోచారం శంభురెడ్డి తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతితో పాటు క్రీడా యూనిఫామ్‌లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, గోపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, గురువినయ్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరగౌడ్, క్రీడాకారులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, పరిగె బాపురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పీఈటీలు సురేందర్, రాజు, సురేందర్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

‘మెరుగైన సేవలు అందిస్తున్నాం’



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న కెనరా బ్యాంకు సీజీఎం పట్నాయక్

దోమకొండ: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో తమ బ్యాంకు ముందుంటుందని కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ కేహెచ్ పట్నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కెనరా బ్యాంకు కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 బ్రాంచ్‌ల ద్వారా వెయ్యి కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. మహిళా సంఘాల సభ్యుల కోసం బ్యాంకులలో అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం దోమకొండ, భిక్కనూరు, అంబారి పేట బ్రాంచ్‌లకు చెందిన ఐకేపీ సంఘాలకు రూ.5 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న, బ్యాంకు ఏజీఎం శ్రీనివాస్‌రావ్, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి, ఉపసర్పంచ్ శ్రీకాంత్, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శేఖర్, డైరెక్టర్ పోశయ్య, బ్యాంకు మేనేజర్ సంతోష్‌కుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి



నిజామాబాద్‌నాగారం: నాందేడ్‌లో ఈ నెల 5న భారత్ రాష్ట్ర సమితి నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని టీఎస్‌డబ్ల్యూ సీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలితరాఘవేందర్ కోరారు. శుక్రవారం మహారాష్ట్రలోని భిషి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సభకు రావాలని ఆహ్వానించారు. తెలంగాణ అమలు అవుతున్న సంక్షేమ పథకాలు ఇక్కడ అమలు కావాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ)ల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు శనివారంతో ముగుస్తుందని సంస్థ రీజనల్ కో–ఆర్డినేటర్ (ఆర్‌సీవో) వి మేరీ ఏసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు www. tswreis. ac. in, www. tsswreisjc. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

13 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ (సీబీసీఎస్)) ఒకటో సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity.ac.in ను సంప్రదించాలని సూచించారు.

జీపీ భూములు కాపాడాలని ధర్నా



సుభాష్‌నగర్: నందిపేట్ మండలంలోని డొంకేశ్వర్ గ్రామపంచాయతీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఆబాది భూములు, గ్రామపంచాయతీ స్థలాలు కబ్జా కాకుండా కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో అనేక భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు గేదెలు సజీవ దహనం



దోమకొండ: మండలంలోని ముత్యంపేటలో కుమ్మరి వెంకటికి చెందిన పశువుల కొట్టం గురువారం అర్ధరాత్రి కాలిపోయింది. రాఘవాపూర్ శివారులో ఉన్న కొట్టం ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనలో కొట్టంలోని మూడు గేదెలు సజీవ దహనం అయ్యాయి.

పదోన్నతులు లేక పరేషాన్

- భాషా పండితులు, పీఈటీలకు ప్రమోషన్లు లేవు
- నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్: ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు. స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా పని చేస్తున్నా ఎస్‌జీటీ వేతనం పొందుతున్నామని భాషా పండితులు, పీఈటీలు వాపోతున్నారు. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా, స్కూల్ అసిస్టెంట్‌లను గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యాశాఖలో చాలా కాలం తరువాత పదోన్నతులకు అడుగులు ముందుకు పడటంతో ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమైతుంది. తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, పీఈటీలకు మాత్రం పదోన్నతులకు అవకాశం లేకపోవడంతో వారు నిరుత్సాహానికి గురవుతున్నారు.

జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితులు 550 మంది, హిందీ పండితులు 450, ఉర్దూ బోధించేవారు 50 మంది, పీఈటీలు 600 మందికి పైగా పని చేస్తున్నారు. వీరికి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు(ఎస్‌జీటీ)గానే గుర్తింపు ఉంది. భాషా పండితులు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధిస్తున్నారు. పీఈటీలు కూడా పదో తరగతి విద్యార్థుల వరకు క్రీడా శిక్షణ ఇస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం అని సుప్రీం కోర్టు గతంలోనే వెల్లడించిందని తమకు మాత్రం పనికి తగిన వేతనం లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి పదోన్నతి కల్పించడానికి సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పదోన్నతులు లేకపోవడంతో తమ సర్వీసు పూర్తిగా ఒకేలా ఉండిపోతుందో ఏమో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించే విషయంపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం హామీ ఇచ్చారు..



ప్రపంచ తెలుగు మహాసభల సాక్షిగా భాషా పండితులు, పీఈటీలకు న్యాయం చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇంత వరకు హామీని నెరవేర్చలేదు. భాషా పండితులు, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా పని చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది.

– ప్రవీణ్ శర్మ, తెలుగు పండిత్, తడపాకల్

అర్హులకు న్యాయం చేయాలి



స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా పని చేస్తూ ఎస్‌జీటీలుగా ఉండిపోతున్న అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి లేదంటే మరో పోరాటం తప్పదు.

– శ్యాం, పీఈటీ, తిమ్మాపూర్

ఎంఈవో వసూళ్ల పర్వం!

నిజామాబాద్‌అర్బన్: బాల్కొండ ప్రాంతంలోని ఓ ఎంఈవో వసూళ్లతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎమ్మార్సీ భవనం ప్రారంభోత్సవ కార్యమానికి సదరు విద్యాధికారి బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల ఉపాధ్యాయుల దగ్గర రూ.వేయి నుంచి రూ.ఐదు వేల వరకు వసూలు చేశారు. అంతేగాకుండా ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలు, కోచింగ్ సెంటర్ యజమానులు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించారు. అధికారికంగా ప్రారంభించే భవనానికి ప్రభుత్వమే కావలసిన నిధులు విడుదల చేస్తుంది. కానీ సదరు ఎంఈవో విరాళాలు సేకరించడం చర్చనీయాంశం అయింది. గతంలో కరోనా సమయంలో వలసదారులకు భోజనం, అంబలి ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు విరాళాలు సేకరించారు. ఆ డబ్బులను సదరు అధికారి దగ్గర ఉంచితే వాటిని సైతం కాజేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ముప్కాల్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన కాలంలో స్వర్ణోత్సవాల పేరిట లక్షల రూపాయలు వసూలు చేసి లెక్కలు చూపకుండా కాజేశాడు. ఆయనపై ఫేక్ బిల్లులతో పాఠశాల గ్రాంట్ల దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి. పాఠశాల ప్రార్థనకు హాజరు కాని ఉపాధ్యాయుల వివరాలు సేకరించి డబ్బులు డిమాండ్ చేయడం లేదంటే జిల్లా విద్యాశాఖ అధికారి ఫిర్యాదు చేస్తానని బెదిరింపులకు పాల్పడడం ఆనావాయితీగా మారింది. దీనిపై డీఈవో దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యాధికారిపై విచారణ చేస్తామన్నారు. అక్రమంగా వసూళ్లు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో భక్తుల జయజయధ్వానాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. మాఘశుద్ధ ఏకాదశి నుంచి వైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా దంపతులు సీతారాముల వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్ పాండే నేతృత్వంలో యాజ్ఞికులు అశ్లేష కృష్ణమాచార్యులు, వేదపండితులు ప్రదీప్‌శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పొద్దుటూరి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ గడ్డం రాధకిష్టారెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, ఎంపీటీసీ కొత్తూరు మానససాయి, ఉప సర్పంచ్ ఆసది రవీందర్, మాజీ చైర్మన్లు గజవాడ రాములు, గురడి నర్సారెడ్డి, దువ్వనర్సయ్య పాల్గొన్నారు. సాయంత్రం నిత్య హోమం, బలిహరణం, అశ్వసేవ కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు గరుడసేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి గరుడ సేవ నిర్వహిస్తారు. గరుడ వాహనంపై సీతారామ, లక్ష్మణ, హనుమంతుడి ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారు. గరుడ వాహనం తమ ఇళ్ల ముందుకు రాగానే సుహాసినులు మంగళ హారతులతో స్వాగతం పలుకుతారు.

రాష్ట్ర జట్టును విజేతగా నిలపాలి



రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

డిచ్‌పల్లి: ఒడిశా రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి 9 వరకు జరగనున్న జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రాన్ని విజేతగా నిలపాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్ బాబు ఆకాంక్షించారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టుకు పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిబిరంలో నేర్చుకున్న మెలకువలను ఉపయోగించి క్రమశిక్షణతో రాణించి జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రభాకర్ రెడ్డి, ఎం గంగామోహన్, జైపాల్‌రెడ్డి, సీహెచ్ నవీన్, మర్కంటి సుజాత, మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, పాఠశాల పీఈటీ నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ నరేష్, వేముల మౌనిక పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాపై ఫిర్యాదు

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో పదోన్నతులకు సంబంధించి రూపొందించిన సీనియార్టీ జాబితాపై కొందరు ఉపాధ్యాయులు ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. మొదటి స్థానంలో ఉన్న విజయ్ కుమార్‌ను ఎలాంటి సమాచారం లేకుండానే పక్కన పెట్టడంపై ఫిర్యాదు చేశారు. నిబంధన ప్రకారం అర్హుడిగా ఉండి ధ్రువపత్రాలు కలిగి ఉన్నాడని వీటిని పరిశీలించకుండానే జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడి ఒత్తిడి మేరకే ఈ వ్యవహారం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారుల విచారణ చేపట్టి న్యాయం చేయాలని విజయ్ కుమార్ కోరుతున్నారు. కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డికి, జాయింట్ డైరెక్టర్‌కు సీనియారిటీ జాబితా సక్రమంగా లేదని ఫిర్యాదు చేశారు.

మగ్గం వర్క్‌కు డిమాండ్



డిచ్‌పల్లి: మగ్గం వర్క్, లేడీస్ టైలరింగ్‌కు మార్కెట్‌లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని ఐకేపీ డీపీఎం నీలిమ అన్నారు. మండలకేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ)ను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకుని, స్వయం ఉపాధి ప్రారంభించి, ఆర్థికంగా ఎదగాలని శిక్షణార్థులకు సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీసీ మురళీమనోహర్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మీ, రామకృష్ణ, రంజిత్, నవీన్, ఫరీదా, జమున తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ విభాగంలో బాలబాలికలకు శుక్రవారం నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో ఎంపికలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 7, 8 తేదీల్లో కరీంనగర్‌లోని మానేరు స్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. జూడో అసోసియేషన్ కార్యదర్శి అభినవ్, జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సంజీవ్ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. పీఈటీలు మురళి, అనిత, నవీన్, ప్రదీప్, విజయ్, ప్రసాద్, వికాస్ పాల్గొన్నారు.

పంటల వివరాలు పక్కాగా నమోదు చేయాలి



అంక్సాపూర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

వేల్పూర్: పంటల వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం మండల వ్యవసాయశాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రైతుల వారీగా పంటల నమోదు ప్రక్రియ చేసేటపుడు ఏఈవోలు ఏ ఒక్క రైతు పంట కూడా తప్పిపోకుండా చూడాలన్నారు. కాలువలు, బోరుబావుల కింద పంటల స్థితి గతులు పరిశీలించి, నీటి ఎద్దడికి గురైన పంటలు ఉంటే జిల్లా వ్యవసాయ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకే రైతులు పురుగు మందులు వాడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మండలంలో యూరియా కొరత లేదని పేర్కొన్నారు. భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయాధికారి నర్సయ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

పంటల నమోదు పరిశీలన

కమ్మర్‌పల్లి: పంటల నమోదు పక్కాగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌లో ఏఈఓలు చేపడుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వరి పంటను మొగి పురుగు ఆశించిందని, నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని రైతులకు సూచించారు. జింక్ లోప నివారణకు చిలేటెడ్ జింక్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. ఏడీఏ మల్లయ్య, ఏఓ లావణ్య, ఏఈఓ రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్యాబ్లెట్ల కోసం వెళ్తూ అనంతలోకాలకు..

లారీని ఢీకొనడంతో ఘటన



లింగారెడ్డి (ఫైల్)

భిక్కనూరు: కుటుంబ సభ్యులకు అవసరమైన ట్యాబ్లెట్లు తీసుకు వచ్చేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని జంగంపల్లి సమీపంలోని జరిగింది. వివరాలు.. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బోల్లారపు లింగారెడ్డి (44) ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. కుటుంబ సభ్యులకు అవసరమైన ట్యాబ్లెట్లు తీసుకువస్తానని భార్యకు ఫోన్ చేసి కామారెడ్డి బయలుదేరాడు. జంగంపల్లి ఆర్‌టీఏ చెక్ పోస్టు సమీపంలోకి లింగారెడ్డి బైక్‌ను లారీ ఓవర్‌టేక్ చేసింది. అనంతరం ఆర్టీఏ చెక్‌పోస్టు కనిపించగానే లారీ డ్రైవర్ అకస్మత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో లింగారెడ్డి వెనక నుంచి లారీని ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ లింగారెడ్డిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య వినోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా ఆర్టీఏ చెక్‌పోస్టుతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు చెక్‌పోస్టు దూరంగా ఉండటంతో డ్రైవర్లకు కనిపించడం లేదని.. దగ్గరకు వచ్చాక సడెన్ బ్రేక్ వేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. ప్రమాదాలకు ఆర్టీఏ అధికారుల నిర్లక్ష్యమే కారణమని రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఆరోపించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని గాయత్రీనగర్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉండే దూరిశెట్టి పోశయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తాడు. పోశయ్య తమ్ముడు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో అతడిని చూసి వస్తానని ఇంటికి తాళం వేసి గత నెల 24న స్వగ్రామమైన లింగంపేట మండలం పోల్కంపేటకు వెళ్లాడు. శుక్రవారం తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు పడినట్లు గుర్తించి దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. 30 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నీలా వాగులో యువకుడి మృతదేహం



రెంజల్: మండలంలోని నీలా పెద్ద వాగులో శుక్రవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. వాగు వంతెన కింద నీటిలో మృతదేహం తేలి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయన్న సిబ్బందితో అక్కడికి చేరుకుని జాలార్లతో మృతదేహాన్ని బయటకు తీయించారు. కాళ్లు, చేతులు, నడుము భాగంలో తాడుకు రాళ్లు కట్టి ఉండటాన్ని గుర్తించారు. ఎవరో హత్య చేసి వాగులో పారేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. యువకుడికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని, జీన్స్ ప్యాంటు, టీషర్టు వేసుకుని ఉన్నట్లు ఎస్సై చెప్పారు.

మృతురాలి గుర్తింపు

మాచారెడ్డి: మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా శివారులో అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళను సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన మండల వెంకటవ్వ(48)గా శుక్రవారం గుర్తించారు. కొన్నాళ్ల క్రితం ఆమె భర్త చనిపోవడంతో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తోంది. అదే మండలం గోరంటాల గ్రామానికి చెందిన గోదాం రమేశ్‌తో సహజీవనం చేస్తోంది. గత నెల 28న డ్యూటీ నిమిత్తం వెళ్లిన వెంకటవ్వ తిరిగి రాలేదని పత్రికల్లో చూసి గుర్తించినట్లు రమేశ్ తెలిపినట్లు ఎస్సై సంతోష్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఒకరు మృతి చెందారు. వివరాలు.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పోశెట్టి (48), సాధు (40), గంగాధర్ (45) గత నెల 25న బైక్ పై వెళ్తా చిక్లి శివారులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడ్డ వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా అదే రోజు పోశెట్టి (48) మార్గమధ్యలో మృతి చెందిన విషయం తెలిసిందే. సాధు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుక్కల దాడిలో పది గొర్రెలు..



మాచారెడ్డి: కుక్కల దాడిలో పది గొర్రెలు మృతిచెందిన ఘటన శుక్రవారం పాల్వంచలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కోరె భీరయ్య గొర్ల కొట్టంలో చొరబడిన కుక్కలు గొర్రెలను కొరికి చంపేశాయి. దీంతో రూ.70వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాధితున్ని ఆదుకోవాలని సర్పంచ్ సునీత, ఎంపీటీసీ లావణ్య కోరారు.

ఒకరి అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన దుబ్బాక నవీన్ గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నవీన్ సోదరుడు శ్రీనివాస్ శుక్రవారం ఫిర్యాదు చేశాడని చెప్పారు.

డిచ్‌పల్లిలో కిడ్నాప్ కేసు కలకలం

- తక్కువ ధరకే బంగారం పేరిట రూ.10 కోట్లు చెల్లింపు
- పసిడి ఇవ్వని మోసగాడిని కిడ్నాప్ చేసిన బాధితులు
- చివరికి జైలుపాలైన వైనం

డిచ్‌పల్లి: తక్కువ ధరకు బంగారం వస్తుందని అత్యాశకు పోయి పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించారు.. చివరకు బంగారం దక్కక పోవడంతో డబ్బులు తిరిగి వసూలు కోసం మోసగాడిని కిడ్నాప్ చేసిన బాధితులే చివరకు నిందితులుగా మారి జైలు పాలైన ఘటన డిచ్‌పల్లి మండలంలో కలకలం సృష్టిస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి.. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన అబ్దుల్ అన్వర్ కొద్ది సంవత్సరాలు దుబాయిలో ఉండి 2019లో గ్రామానికి వచ్చాడు. తనకు దూరపు బంధువైన ప్రైవేట్ పాఠశాల యజమాని, రియల్ ఎస్టేట్ వ్యాపారి మహ్మద్ నబీని కలిసి తనవద్ద దుబాయి నుంచి తెచ్చిన బంగారం పెద్ద మొత్తంలో ఉందని డబ్బులిస్తే సగం ధరకే ఇస్తానని నమ్మబలికాడు. దీంతో నబీ ఘన్‌పూర్‌లోని ప్రైవేట్ పాఠశాల నిర్వాహకుడు విక్రాంత్, రియల్ వ్యాపారి బచ్చుసాగర్, తెలిసిన వారైన మహ్మద్ అలీం, అబ్దుల్ గఫార్, మహ్మద్ ఖాజా షఫియుద్దీన్, మహ్మద్ అబ్దుల్ షౌకత్ నజీర్, ఖలీల్, యూనుస్, షమీకి విషయం చెప్పాడు. దీంతో బంగారంపై ఆశతో మొత్తం 12 మంది కలిసి అన్వర్‌కు రూ.10 కోట్లు ఇచ్చారు. వారికి కొంత బంగారం ఇచ్చిన అన్వర్ మిగతాది త్వరలోనే తెప్పించి ఇస్తానని చెప్పి మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్నాడు. బంగారం, డబ్బులు ఇవ్వకుండా అన్వర్ తప్పించుకు తిరుగుతుండటం, ఫోన్ చేసినా స్పదించకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. అతడి కోసం గాలిస్తుండగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాయత్రినగర్‌లో బంధువు లతీఫా ఇంట్లో అద్దెకు ఉంటున్నట్లు తెలుసుకున్నారు. బాధితులు జనవరి 29న రాత్రి అన్వర్, అతడి భార్య రేష్మ, ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేశారు. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లోని రైస్‌మిల్‌లో ఉంచారు. తమ డబ్బులను తిరిగి ఇచ్చివేయాలని అతడిని విచక్షణారహితంగా కొట్టారు. లతీఫా ఇచ్చిన ఫిర్యాదుతో నిర్మల్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. భయపడిన నిందితులు అన్వర్‌కుటుంబాన్ని నిర్మల్‌లో వదిలిపెట్టి నాగ్‌పూర్‌కు పారిపోవడానికి యత్నించగా వారిలో ఏడుగురిని పోలీసులు పట్టుకున్నారు. పరారీలో ఉన్న ఐదుగురి కోసం గాలిస్తున్నారు. బంగారం కోసం ఆశపడి కిడ్నాప్ కేసులో ఇరుక్కుని మండలంలో పేరొందిన ఇద్దరు ప్రైవేటు పాఠశాలల యజమానులు, రియల్ వ్యాపారి, ఇతరులు కటకటాలపాలు కావడంతో చర్చనీయాంశంగా మారింది. వీరంతా అన్వర్‌కు రూ.10 కోట్లు ఎలా చెల్లించారనే విషయంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. అన్వర్‌కు డబ్బులు ఇచ్చిన మోసపోయిన వారిలో ఇద్దరు ఎన్ఆర్ఐలు ఉన్నట్లు తెలుస్తోంది.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

నిజామాబాద్ సిటీ: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. బోధన్ మండలం సాలూరా గ్రామానికి చెందిన కాసరెల్లి రారాజు(30) పెళ్లి మండపాల్లో డెకరేషన్ పనులు చేస్తాడు. ఇతడికి పెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు పలుమార్లు మాట్లాడగా తనకు ఇష్టం లేదన్నట్లుగా వ్యవహరించేవాడు. అనంతరం రారాజు జీవితంపై విరక్తి చెంది నిజామాబాద్ రూరల్ మండల మల్లారం గండి (అటవీ ప్రాంతంలో)లో శుక్రవారం రాత్రి ఉరేసుకున్నాడు. శనివారం అడవిలోకి వెళ్లిన మల్కాపూర్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అనారోగ్యంతో మహిళ..

ఎడపల్లి: ఎడపల్లికి చెందిన దేరిడి అనసూయ(55) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పాండేరావు తెలిపారు. వివరాలు.. అనసూయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపెట్టుకున్న నయం కాలేదు. దీంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.